
# టుహిమ్ విత్ లవ్..

పి. సత్యవతి



అప్పుడెప్పుడో పాతికేళ్ళ క్రితం ఎనిమిది ప్రేమలేఖలు అందుకున్నాక తొమ్మిదోదానికి జవాబు వ్రాయక తప్పని పరిస్థితిలో– ఎవరూ చూడరని అనుకున్నచోట తలుపులు వేసుకుని కూర్చుని, సంబోధన తెలియక పది కాగితాలు వుండచుట్టి పడేసి, పదకొండవ కాగితాన్ని సంబోధన లేకుండానే నాలుగు పంక్తులలో ముగించడం గుర్తొస్తోంది.

ఇప్పుడు మళ్ళీ అదే సమస్య రావడం– మధురమైన విషాదమో, విషాద మధురమో నాకు తెలీదు.

ఆ వేళ ఆ నాలుగు పంక్తులు వ్రాసేటప్పుడు మనస్సులో తియ్యని ఆరాటం. ఓ విధమైన భయం- ఈవేళ అవేవీ లేవు-నాకు సంపెంగపూలంటే యిష్టమనీ- కనకాంబరాలంటే ఏవగింపని. ఇంట్లో మాత్రమే పూలు పెట్టుకుంటానని- అవీ- మల్లెపూలయితేనని- నీకు తెలుసునని నాకు తెలుసు-నేను పంపిన నాలుగు పంక్తులకీ సమాధానంగా నాకు ఓ సంపెంగ పువ్వు వచ్చింది-ఐహూళా అది మల్లెల కాలం కాదని కాబోలు! నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంది.

కాలాన్ని వెనక్కి తీసుకుళ్ళే అవకాశం ఒక్కో మనిషికీ జీవితంలో ఒక్కొక్కసారి వస్తే ఎంత బావుండును అని — మీ వాకిట్లో సంపెంగ చెట్టు పువ్వులన్నీ ప్రతీ రోజూ ఒక్కొక్కటి మాయింటికి వస్తూ వుండేవి.

తరువాత మా ఇంటి పెద్దాడబడుచ —మీ ఇంటి ఏకైక పుత్రరత్నం - చాలా సార్లు కృష్ణానదీ తీరాన — బందరు రోడ్డు వెంట- ప్రబోధ పుస్తకాల షాపు ఆవరణలో కలిసి కనిపిస్తున్నారనే వార్తలు మా నాన్నగారి చెవిని సోకడం- ఆయన కలుగచేసుకునే లోపున రిజిస్ట్రార్ ఆఫీసులో సంతకాలు జరిగిపోవటం—ఆపైన మళ్ళీ ఆకాశమంత పందిరీ— భూదేవంత అరుగూ-ఇంకా బాకా బాజా డోలూ— సన్నాయి — బంధువులు భోజనాలు హడావుడీ—

జీవితంమీద కోటి ఆశలు — కళ్ళనిండా కలలు—కాంతివేగంతో పరుగుపెట్టిన కాలం-

ఆ ఆల్బంలో పేజీలు ఇప్పుడు చూస్తూ వుంటే—కళ్ళక్రింద నల్లచారలు లేని నిష్కల్మషమైన ఆ మొహాలు— సూర్యుడితో పోటీపడే దరహాసాలు. కీట్స్ చెప్పినట్లు యౌవ్వనం జీవనవసంతం-ఆవసంతంలోంచి ఆ పూల తోటల్లోంచీ— నవ్వుల బాటల్లోంచి పరిగెట్టిన రైలుబండి- ఒక్క కుదుపుతో కారుచీకటిలాంటి సమయంలో అడవిలాంటి మధ్య వయస్సులో ఆగిపోవటం గుర్తొస్తోంది—

ఒకసారి మనిద్దరం చదరంగం ఆడ్డానికి కూర్చున్నాం— సాయంత్రం ఆరింటికి— నువ్వు మర్చిపోయి వుంటావు. నేను మాత్రం ఏదీ మర్చిపోలేను. మనకి విసుగు వచ్చేసరికి గడియారంచూస్తే మూడు గంటలైంది. "అన్నం వండలేదుగా!" అన్నాను నేను ఉలిక్కిపడి—

"ఇంకేం భోజనం లెద్దూ—" అనేసి నువ్వే పాలు వెచ్చబెట్టి కప్పుల్లో పోసి తెచ్చేవు—

నేను వెళ్ళి చన్నీళ్ళ స్నానం చేసొచ్చేను-

ఈ సంగతి ఆ మధ్య నువ్వు క్లబ్బునించి ఇంటికి రాని రోజు, నేను పాత పుస్తకాల షల్ఫులోంచి ఆరుద్ర "సినీవాలి" తెచ్చుకుని చదువుతూ పడుకుని మూడు గంటల వేళ ఉలిక్కిపడి టైం చూసినప్పుడు జ్ఞాపకం వచ్చింది.

సరిగ్గా అప్పుడే వాకిట్లో కారు ఆగడం. నువ్వురావడం, వస్తూనే మంచానికి చేరబడ్డం-

నాకప్పుడు ఆకలివేసింది-పాలైనా త్రాగితేనో అనిపించింది. సరిగ్గా అప్పుడే నాకి చదరంగంరోజు గుర్తుకొచ్చింది - ఆరోజు నువ్వు నాకు పాలకప్పు అందిస్తుంటే. మా అమ్మ గుర్తుకొచ్చింది — నేను కాలేజీలో చదువుకునేటప్పుడు. మా అమ్మ అలాగే సరిగ్గా నేను అలసిపోయే వేళకి పాలతో ఎదురుగా నిలబడేది — ప్రేమంటే ఏమిటో నాకు మా అమ్మ తెలియజెప్పింది— మళ్ళీ ఆ ప్రేమని నీలో చూసినప్పుడు నా జన్మ ధన్యమైందనుకున్నాను. కానీ రాత్రి మూడింటికి క్లబ్బునించీ వచ్చి, "ఇంకా మేలుకున్నావేం?భోజనం చేశావా!" అనైనా అడగని నిన్ను చూసినప్పుడు- అప్పుడు కూడా నువ్వు క్లబ్బులో ఏమైనా తిన్నావో లేదో- కనీసం మజ్జిగైనా త్రాగుతావేమోనని విలవిలలాడేను. అందుకే నాకు ఏమీ త్రాగాలనిపించ లేదు. నిన్ను దగ్గిరికి తీసుకుని,"అయ్యోనా బంగారుకొండానువ్వు చెడిపోతున్నావు-నిన్నెలా బాగుచేసుకోను!" అని ఏడవాలనిపించింది.

నీకు తెలుసు- నాకు ఏడవడం అంటే అసహ్యం. కానీ నేను కూడా ఏడ్చాను-

ఎప్పుడో తెలుసా!

నా కేదో జబ్బు వుందనీ- దానికి సర్జరీ అవసరం అనీ డాక్టరు చెప్పినప్పుడూ కాదు- నా ప్రియ స్నేహితురాలు పద్మ వొళ్ళు కాల్చుకుని చనిపోయినప్పుడూ కాదు- అప్పుడు నేను ఆయన్ని ఓదార్చేను- వాళ్ళ పిల్లల్ని సముదాయించాను - నెల రోజులు వారింటికి రెండుపూటలా భోజనం పంపించాను- ఆ పిల్లల్ని తీసుకొచ్చి తలంట్లుపోసి పంపాను- కానీ నేను ఏడవలేదు-

"నువ్వు చాలా గట్టిదానివి-" అని నన్ను చాలామంది అనడం నాకు తెలుసు-

అంత గట్టిదనం- ఏమైపోయిందోగానీ నేనూ ఏడ్చాను- ఎప్పుడు?

మన పెద్దమ్మాయి కరుణ ఎనిమిదో పుట్టిన రోజునాడు నువ్వు అర్జంటుగా క్యాంపు వెళ్ళాలని వెళ్ళావు గుర్తుందా? ఆ రోజు రాత్రి నువ్వు వెళ్ళిన రైల్లోనే పద్మ కూడా ప్రయాణం చేసింది— అది తిరిగి రాగానే మనింటికి వచ్చి చెప్పిన వార్త విని నేను ఏడవలేదు— కానీ ఆ తరువాత మళ్ళీ




ఓసారి ఇలాంటి క్యాంప్‌కే నువ్వు వెడతావని బయలుదేరినప్పుడు — అప్పుడు నేను నిన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాలని యాపిల్ పళ్ళు కొనుక్కొని కరుణనీ కాంతినీ తీసుకొని నీవెనకాలే స్టేషన్ కొచ్చాను-

తరువాతేం జరిగిందో నీకు తెలుసు — అప్పుడింటికివచ్చి గట్టిదాన్లా ప్రవర్తించాలని ఎంత ప్రయత్నించినా నాకుసాధ్యంకాలేదు. ఆరోజు నేను కరువుతీరా ఏడ్చాను-


అమ్మకి నాన్నకి అబద్దాలు చెప్పి నాకోసం నువ్వు హైదరాబాద్‌కి- విజయవాడకీ వచ్చి నాతో కులాసాగా గడిపినప్పుడు ఆ తెలివికి నేనెంత సంతోషించానో- నాతో అబద్ధాలు చెప్పి మళ్ళీ నువ్వు వెడుతూంటే అంత ఏడ్చాను- నీవల్ల నాలో ఆత్మ విశ్వాసం పెరిగింది- నీ సాహచర్యంలో నేనెన్నో నేర్చుకున్నాను— తిండి. బట్టా యిచ్చి భరించేవాడే భర్త అన్న నిర్వచనాన్ని నేనెంత అసహ్యించుకుంటానో నీకు తెలుసు- నువ్వు అలాకాక- ఇన్నాళ్ళూ నా జీవన భాగస్వామిగా- నా ప్రియమిత్రుడిగా వుంటూ వచ్చి-ఒక్కసారిగా నా ప్రేమ మీద- నా ఆత్మాభిమానం మీద చావుదెబ్బ కొట్టగలవని నేనూహించలేదు. నీ తప్పునీకు చూపించి. నిన్ను పది మాటలలో హింసించి నన్ను నేను కించపరుచుకోడం నాకు అనహ్యంగా అనిపించింది. కన్నీళ్లు తుడుచు కోడం కష్టమే అయినా— కృషితో సాధ్యం కాని దేదీ లేదు- ఎన్నయినా చెప్పవచ్చు- కానీ—అప్పుడప్పుడే కళ్ళు తెరుస్తూ లోకంలోకి వచ్చిపడిన పసికూనలకి ప్రేమతో కూడిన ఓ గూడు అవసరం అని నాకు తెలుసు. విధినిర్వహణకోసమే మనిషి బ్రతుకు అనికూడా నాకు తెలుసు — కానీ. నేను మావూరు వెళ్ళి రెండు రోజులు రాకపోతే "చెలి, గాం" పంపించే నువ్వు—ప్రొద్దున్నే నేను నిద్రలేపితేగాని లేవని నువ్వు — నేను దగ్గర కూర్చుని వడ్డిస్తేగాని భోజనం చెయ్యని నువ్వు — నేనెప్పుడైనా అనారోగ్యంగా కనిపిస్తే పదిసార్లు అడిగి మందు యిచ్చే నువ్వు—ఏ మంచిపుస్తకం కనిపించినా నాకోసం కొని తెచ్చిన నువ్వు. నన్నొక అడదానిగా కాక నీ స్నేహితురాలిగా. నీ ప్రేయసిగా భావించిన నువ్వు- ఆ స్నేహంలో- ఆ ప్రేమలో భాగాలు పంచగలవని నేనెన్నడూ ఊహించలేదు—

నీకు గుర్తుందో లేదో — మా చెల్లెలి పెళ్ళిలో ఎవరో గాజుగ్లాసు తన్ని పగలగొట్టేరు— గాజు పెంకు నీ కాలిలో విరిగింది- అప్పుడు నేను నీ కాళ్ళు కడిగి దూది తెచ్చి కట్టుకట్టడం- గదిని పదిసార్లు చిమ్మించడం చూసి మాబావ మా అక్కతో "దానికి చూడు మొగుడంటే ఎంత ప్రేమో-" అని చెప్పడం!- నాకిదేకాదు ఇంకా చాలా గుర్తున్నాయి-

నేను హాస్పిటల్లో వున్నప్పుడు- నాకు గ్లూకోజు డ్రిప్ తప్ప మరేం ఆహారంలేనప్పుడు- నేను కాళ్ళ నెప్పులతో మెలికలు తిరిగిపోతుంటే-నువ్వు నాకు కాళ్ళు పట్టడం -అప్పుడు మీ అమ్మ వచ్చి. చూసి ఎన్నోసార్లు "నీకాళ్ళు వాడే పట్టాడు-" అని నన్ను పదిసార్లు దెప్పడం—ఆ రోజు.... నాకింకా చాలా గుర్తున్నాయి. ఎన్నని చెప్పను? నాకు తెలుసు నీకూ గుర్తుందే వుంటాయి.

ఆ రోజు నేను కరుణనీ కాంతినీ తీసుకుని ఇంటికి వచ్చి కంటికి కడివెడుగా ఏడ్చినప్పుడు- ఒక్కసారి పదేళ్ళు పెద్దదాన్నయిపోయినట్లు- కళ్ళు లోతుకు పోయినట్లు- తలలో తెల్లవెంట్రుకలు వచ్చినట్లు- నడుం కృంగిపోయినట్లు బాధపడిపోయాను- ఇప్పుడు మనమధ్య పొరపొచ్చాలు లేవు. ఫస్ట్ తారీకు రాగానే పే ప్యాకెట్ తెచ్చి నా చేతిలోనే పోస్తావు— నేనేది పెట్టినా తినడమే గాని వంకలు పెట్టడం లేదు— ఇప్పటికీ నా. పుట్టిన రోజులు వివాహ వార్షికోత్సవాలు నీకు గుర్తున్నాయి. అవి యధావిధిగా- యాంత్రికంగా జరిగిపోతూనే వున్నాయి. అమ్మాయిలకి నువ్వంటే అభిమానం. అమ్మయినా కేకలేస్తుందిగాని నాన్నే చాలా మంచివాడంటారు— పైపైకి నందనవనమే — కానీ ఇరవై అయిదేళ్ళల్లో మనం ఎంతో దూరం అయిపోయాం అనుకుంటే గుండె పగిలినట్లవుతుంది— నాకు తెలుసు- నువ్వు పూర్వంలా సూటిగా నా మొహంలోకి చూడలేవు- నిష్కల్మషంగా నిర్మలంగా మాట్లాడలేవు- నేను అందుకే ఏమీ తెలియనట్లే వుంటూవచ్చాను- నీలో ఏర్పడుతున్న గిల్టికాన్షస్‌నెస్‌ని మరింత పెంచడం యిష్టంలేక - నీకు తెలీదుగానీ ఓ సారి నేను కరుణనీ కాంతినీ తీసుకుని మావూరు వెళ్ళాను—వెళ్ళేటప్పుడు పుట్టెడు రోషంతో వెళ్ళాను—ఎందుకో తెలుసా? తెలుసు నీకు— మరింక నీ మొహం చూడకూడదనుకున్నాను—నాలుగో రోజుకి వాకిట్లో కారుంది— అప్పటికి మనకి కారు లేదు—అది టాక్సీ— నేనూ మా పెద్ద చెల్లీ వరండాలో పడుకుని విట్‌మన్‌కీ. శ్రీశ్రీకి గల పోలికలని గురించి చర్చిస్తున్నాం — విట్‌మన్ అంటే నాకు చాలా యిష్టం—అతని ఫిలాసఫీ నాకు బాగా నచ్చుతుంది—

"బావొచ్చేడేవ్!" అంది మా చెల్లి- నేను వులిక్కిపడ్డాను- గభాలున లేచి కూర్చుని



చూశాను— వారంరోజులుగా గడ్డం చేసుకోలేదు నువ్వు- కళ్ళు లోతుకుపోయాయి-

"అలా వున్నావేం? వంట్లో బాగాలేదా?" అని అడిగాను.

"నువ్వు లేవుగా!"

అప్పుడు మరో స్త్రీ అయితే ఇంకో జవాబు రెడీగా యిచ్చి వుండేది- కానీ నేను మాత్రం "నిజంగా!" అన్నాను- "నిజం" అన్నావు నువ్వు- అంతే నేను కారెక్కాను- నీ మాటలకి ఉబ్బిపోయి కాదు- నీ పోషణ లేనిదే బతక లేననే ధైర్యం లేక కాదు. నిన్ను వదిలిపెడితే లోకం పరిహసిస్తుందనీ కాదు- నీకు వ్యసనాలెలా వ్యసనాలో- నాకు ప్రేమ అలా వ్యసనం-నువ్వు రమ్మని పిలిస్తే రాననే కాఠిన్యం నాలో లేదు- నువ్వు పిలిచినప్పుడు రానన టం నాకు బాగుండదు- కాంతీ కరుణా నాకన్న ముందే కారెక్కి కూర్చున్నారు. కాంతికీ కరుణకీ నువ్వు కావాలి— వాళ్ళకి నేనూ కావాలి. వాళ్ళకి నువ్వూ నేనూ కలిసి వుండడం కావాలి. అందుకే నేను కారెక్కాను— వ్యసనం మైనస్ నువ్వు. నువ్వే- అ నిన్ను మాత్రమే నీలో చూసుకుంటూ బ్రతకాలనే నిర్ణయంతో మళ్ళ నేను వచ్చాను. చేతికెదిగివచ్చిన పెద్దకొడుకు పెడదోవ పడుతూవుంటే తల్లిగుండె ఎంత క్షోభిస్తుందో నా మనస్సు అలాగే క్షోభించింది-

ఓ రోజు సాయింత్రం నువ్వు ఒక్కడివే టెర్రేస్ మీద కూర్చుని సిగరెట్ కాలుస్తుంటే నేను అక్కడికి వచ్చాను— అప్పటికే టీపాయ్‌మీద గ్లాసు వుంది - దాని వెనక సీసా వుంది - నేను మళ్ళ క్రిందకి వెళ్ళ తినడానికితెచ్చి మౌనంగా నిలబడ్డాను. ఒక్క నిమిషం - వెనక్కి తిరిగి వెళ్ళాలని ప్రయత్నిస్తుండగా. "ఏం. కూర్చుంటే నీ సొమ్మేంపోయింది-" అన్నావు- నేను కూరు న్నాను- మన మధ్యకి సీసాలు. గ్లాసులూ ప్రవేశించకముందు- టీపాయ్ మీద ఫ్రెష్‌గా కోసి తెచ్చిన గులాబీలలో అలంకరించిన ఫ్లవర్ వాజు వుండేది- మనం ఒక్కోసారి కవిత్వం గురించి. ఒక్కోసారి రాజకీయాల గురించి ఒక్కోసారి స్నేహితుల్ని గురించి. ఒక్కోసారి మనని గురించీ మాట్లాడుకునేవాళ్ళం- తరువాత కరుణ అల్లరి గురించి కాంతి తెలివిగురించీ చెప్పుకునేవాళ్ళం—ఇప్పుడు ఏం మాట్లాడాలో నాకు తెలీడంలేదు—అందుకే నీ గ్లాసులో రెండు ఐస్‌క్యూబ్‌లు వేసి "మిడిల్‌ఏజ్ వస్తుంటే ఆరోగ్యం చూసుకోవాలి" అన్నాను.

"సారీ డియర్—" అన్నావు నువ్వు — తరువాత మనం మాట్లాడుకోలేదు — పిల్లలు భోజనానికి వచ్చారు—

నేను సడెన్‌గా గుర్తించాను— పిల్లలు మారుతున్నారు. వాళ్ళకి నామీద డిపెండెన్సీ తగ్గిపోతోంది. వాళ్ళు నా నుంచి దూరం అయి స్వతంత్రంగా ఆలోచించడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు నా ఒంటరితనం నాకు స్పష్టంగా అర్థమైంది. ఇంతమందివున్న ఇంట్లో నేను భయంకరమైన ఒంటరితనం భరించాను— అందుకే ఏదో వ్యాపకం కావాలని ఈ చైల్డ్ కేర్ సెంటర్ తెరవడం- నేను కూడా ఊపిరాడనంత బిజీ అయిపోవడం- పది మందిలోకి వెళ్ళడం వలన ఒంటరితనాన్ని మర్చిపోగలగడం - తెల్లవారగానే అమాయకులైన పసిపిల్లలు కిన్నెరల పండువగా కనిపిస్తుంటె - ఎంత విషాదాన్నైనా మర్చిపోవచ్చుననే విషయం నాకర్థం అయింది— కరుణా, కాంతీ ప్రొఫెషనల్ కోర్సులో సీట్లు తెచ్చుకుని ఎవరి దారినవాళ్ళు వెళ్ళాక- మనిద్దరం-ఎవరి వేళకి వాళ్ళుఇంటికి రావడం సంపాదించుకోడం— తినడం— మొనాటనీ- "మీరిద్దరూ చాలా హుషారుగా వుంటారు-సంతోషమే సగంబలం- యూ లుక్ వెరీ యంగ్-" అనే ప్రశంస లందుకుంటూ సంఘంలో గౌరవమర్యాదలకి లోటులేకుండా పార్టీలు భజనలకి చిలకాగోరింకల్లా కలిసి వెడుతూ మెప్పులూ-ప్రశంసలూపొందుతూ కాలం నెమ్మదిగా నడుస్తోంది-

అవును ఈమధ్యన తెల్లవారుఝామున లేచి మనిద్దరం వాకింగ్‌కి వెళ్ళ వస్తూంటే చాలామంది మన అన్యోన్యాన్ని ప్రశంసించారు— పిల్లల్తో కలిసి బాడ్‌మింటన్ ఆడుతూంటేనూ ముచ్చటైన మన సంసారాన్ని మెచ్చుకున్నారు-

నువ్వు కృష్ణశాస్త్రి కవిత్వాన్ని కోట్ చేస్తూ. నాకు వ్రాసిన మొదటి ఉత్తరం- తరువాత వ్రాసిన ఉత్తరం- తరువాత- తరువాత-అవన్నీ ఎప్పుడైనా ఓసారి చదువుకుంటుంటే నాకు కొండంత బలం వస్తూంవుంటుంది—


ఇదంతా ఎందుకు వ్రాస్తున్నాను అనుకుంటున్నావు కదూ? నీకు ఉత్తరం వ్రాసి చాలా కాలం అయింది - చాలా సంవత్సరాలయింది— మళ్ళ ఓసారి నీకు ప్రేమ లేఖ వ్రాయాలని ముచ్చటగా వుంది—

నిన్న సాయంత్రం గుంటూరు నించి కరుణా. మద్రాసు నించి కాంతీ వచ్చారు— అప్పుడే క్లబ్బువారు ఓ ఇన్విటేషన్ తెచ్చారు— మిస్టర్ ఫలానా. మిసెస్ ఫలానా గార్ల సిల్వర్ వెడ్డింగ్ ఫలానాతేదీని జరుగుతుంది—కనుక అందరూ రావాలని-"మేమూ అందుకే వచ్చాం—" అంది కరుణ.

"మీ ఇద్దరికీ ఎయిర్ ఫ్లయిట్ టికెట్లు కొన్నాను మమ్మీ— మద్రాసు తాజ్ కోరమాండల్‌లో ఎ పి. సూట్ రిజర్వ్ చేయించాను— సెకండ్ హనీమూన్-" అంది కాంతి.

నా కళ్ళల్లో నీళ్ళొచ్చాయి- మన వివాహ రజతోత్సవం పిల్లలు నాకు చెప్పేది?? దాన్ని గురించి నేను ఎవరి ద్వారా మొదట వినాలనుకున్నాను ?

"నా కెమేరాలో కలర్ ఫిల్మ్ వేయించు




కాచేను—రేపు మీ ఇద్దరికీ మంచి ఫొటోలు తియ్యాలి-నీకన్న నాన్నే నయం — నువ్వు మరీ ఓల్డ్‌గా అయిపోయావు— నీకు రెస్ట్ కావాలి మమ్మీ— నాన్న సంపాదించేది చాలదా? ఏం చేస్తావు డబ్బులన్నీ- నగలు వేసుకోవు- పట్టుచీరెలు కట్టవు-" కాంతి నా భుజంమీద వాలి గారాబంగా అంది-

వీళ్ళంతా ఎంతో ఆర్భాటంగా ఈవండుగ చేస్తున్నారు-

నాకో సంగతి జ్ఞాపకం వచ్చింది-

"పిల్లల చదువులు పూర్తి కాగానే ఉద్యోగం మానేసి. ఎంచక్కా చిన్న పాక వేసుకొని చుట్టూ పూలతోట పెంచుకొని - ఏదైనా పల్లెటూళ్ళో వుండిపోయి అప్పుడప్పుడూ సిటీకి వెళ్ళొస్తూ వుంటే బావుంటుందికదూ!" అన్నాను నేనోసారి-

"అవును మరి - సిటీకి వెళ్ళకపోతే పల్లెటూళ్ళో సినిమాలూ - సభలూ - సమావేశాలూ వుండవు-" అని వెక్కిరించావు నువ్వు-



ఆ సమయం ఇప్పుడు ఆసన్నమౌతోంది అనిపిస్తోంది నాకు-

కాంతి గడుగ్గాయి - అది మనిద్దరినీ విమానం ఎక్కించేదాకా వూరుకోదు — అప్పుడు మన సెకండ్ హనీమూన్‌లో— మనం ఏం మాట్లాడుకుంటాం? అందుకే ఈ ఉత్తరం— స్త్రీ పురుషుల మధ్య ప్రేమ కేవలం ఆకర్షణకీ— దానికి పరమార్థం ఒక్కటేనని స్కెప్టికల్‌గా చెప్పేవాళ్ళంటే నాకు చిరాకు— ప్రేమ లేనిదే ప్రపంచం లేదు— ప్రేమ మూలంగానే ప్రపంచం నిలిచింది అని నమ్మేవాళ్ళల్లో నేనొకదాన్ని— అందుకే రాత్రి రెండింటి వరకూ మేలుకొని- ఐసులూ—మంచింగ్‌లూ ఏర్పాటు చేశాను- నువ్వు క్యాంప్ వెళ్ళి వచ్చేరోజున నీకోసం ఫ్రిజ్‌లో నీకేం కావాలో అమర్చాను— ఎప్పుడెక్కడికి వెళ్ళావని అడగలేదు- ఇంత లేటేం అని అడగలేదు- నా సంస్కారంతో నిన్ను మార్చాలనే వెర్రి ఆరాటంతో గడిపాను. నువ్వు మారావో లేదో నీ మనసులో మనసునైన నాకు తెలుసు- నీకూ తెలుసు- ఇంతకీ నా కోరిక ఒక్కటి విన్నవించాలని ఇంత చెప్పాను. ఒక్కసారి-ఒక్కసారి పాతికేళ్ళనాటి నిన్ను చూడాలని! ఈ సోఫిస్టికేషన్- ఈ డిప్లొమసీ- ఇవేవీ లేని యవ్వనం తొలిరోజుల్లోని నువ్వు ఒక్కసారి నాకు దర్శనం యిస్తావని నమ్ముతూ. ఈ లేఖ ముగిస్తున్నాను. నీ "సిల్వర్ వెడ్డింగ్"కి ఇదే నేనిచ్చే కానుక. ఈ ఉత్తరానికి సంబోధన లేనట్లే. సంతకం కూడా లేదు- అక్కర్లేదు కూడా!


మీ అభిమాన రచయిత్రి
యద్దనపూడి సులోచనారాణి సీరియల్
ఈ జీవితం నాది
యువ జూన్ సంచికలో ప్రారంభం!



